వ్యవస్థల నిర్వీర్యం.. ఇదేం ప్రభుత్వం

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో ప్రభుత్వ సేవలను నేరుగా ప్రజల ఇళ్ల వద్ద అందేలా చేశారు. వలంటీర్లు ప్రజలకు అవసరమయ్యే ప్రతి ప్రభుత్వ సేవను వారి చెంతకు చేర్చేవారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక అది రివర్స్ అయింది. సచివాలయాలకు వెళ్తే స్పందించడం లేదు. ప్రస్తుతం విద్యాసంస్థలు ప్రారంభమయ్యే సమయం కావడంతో విద్యార్థులకు, బ్యాంకు రుణాలు ఇతరత్రా వాటికి అవసరమయ్యే ధ్రువీకరణ పత్రాల కోసం జనం ఇబ్బంది పడుతున్నారు.

- గత ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దకే సర్టిఫికెట్లు
- కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ కార్యాలయాలకు పరుగులు పెడుతున్న జనం
- సచివాలయాలకు వెళ్తే స్పందన కరువు
- తిండితిప్పలు లేక మండలకేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద పడిగాపులు

చిల్లకూరు : ఇళ్ల వద్దకే ప్రభుత్వ సేవలు అందించే వలంటీర్లు లేరు. సచివాలయాలకు వెళ్తే అక్కడ సిబ్బంది నుంచి స్పందన కరువు. పైగా మండలకేంద్రాలు వెళ్లాలని ఉచిత సలహా ఇచ్చి పంపుతున్నారు. దీంతో చదువు రాని వారు, వృద్ధులు, దివ్యాంగులు ధ్రువీకరణ పత్రాల కోసం మండలం కేంద్రం వరకు పరుగులు పెట్టాల్సిన స్థితి నెలకొంది. భర్త చనిపోయిన మహిళ పింఛన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన మరణ ధ్రువీకరణ పత్రం కోసం నెలల పాటు అవస్థలు పడాల్సి వస్తుంది. అదే గతం ప్రభుత్వం అయితే వలంటీర్ తానే స్వయంగా సచివాలయంలో దరఖాస్తు చేసి ధ్రువీకరణ పత్రాన్ని సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దకే తెచ్చి ఇచ్చేవారు. ఇప్పుడు ప్రతి పనికీ మండల కేంద్రంలోని కార్యాలయాలకు వెళ్తే తీరా అక్కడికి వెళ్లాక వీఆర్‌ఓలు, తహసీల్దార్లు అందుబాటులో లేకపోవడంతో సాయంత్రం వరకు తిండీతిప్పలు లేక పడిగాపులు కాస్తున్నామని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొత్తం వ్యవస్థలనే నిర్వీర్యం చేస్తున్న కూటమి..

సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేయడమే పనిగా పెట్టుకుంది కూటమి ప్రభుత్వం. సచివాలయాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా ఉన్నవారినే సర్దుబాటు కింద బదిలీలు చేస్తున్నారు. దీంతో సచివాలయాల్లో సిబ్బంది లేక సేవలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు అవస్థలు తప్పడం లేదు



ఈమె పేరు గడ్డం లక్ష్మి. భర్త కోటేశ్వరరావు. వీరిది చిల్లకూరు మండలం వల్లిపేడు గ్రామం వీరి కుమార్తెకు జనన ధ్రువీకరణ పత్రం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగి అలసి పోయారు. బడిలో చేర్పించే సమయానికి మూడేళ్లు పూర్తి కావొస్తుండగా 2023లో స్థానిక వలంటీర్ ద్వారా కుమార్తె మహిత బర్త్ సర్టిఫికెట్ నేరుగా ఆమెకు అందించారు. దీంతో ఆమె బిడ్డను స్థానికంగా ఉండే అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించగలిగింది. ఇప్పుడు ఇబ్బంది పడుతోంది.



గూడూరు మున్సిపల్ పరిధిలోని పోటుపాళెం సచివాలయంలో కనిపించని సిబ్బంది



చిల్లకూరు: బల్లవోలు గ్రామ సచివాలయం

నియోజకవర్గాలు: గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట. (03)
మండలాలు : 17
మున్సిపాల్టీలు: 04.
సచివాలయాలు : 213.
గత రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల సర్టిఫికెట్ల దరఖాస్తులు : 714

పెండింగ్‌లో దరఖాస్తులు..

సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారివి పెండింగ్‌లోనే ఉంటుండడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. వేసవి సెలవులు పూర్తి కావొస్తున్న తరుణంలో ప్రతి విద్యార్థికీ కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు అవసరం అవుతాయి. పాఠశాల, కళాశాలలతో పాటుగా ఇతర కోర్సుల్లో చేరేందుకు సర్టిఫికెట్లు తప్పనిసరి. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయానికి వెళ్తున్నారు.

కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా..



ఇంటర్ పూర్తి చేసిన నా కుమార్తెను బీటెక్‌లో చేర్పించాలి. అందుకు కుల, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాలు కావాలని వారం రోజుల క్రితం దరఖాస్తు చేసుకున్నా. అయినా ఇప్పటి వరకు ఇవ్వలేదు. గతంలో వలంటీర్‌కు చెబితే చాలు వారే నేరుగా సర్టిఫికెట్లు ఇంటికి తీసుకుని వచ్చేవారు.

– పల్లం లక్ష్మీనారాయణ, చిట్టమూరు

గంటల వ్యవధిలో ఇచ్చేవారు..



కుటుంబ పెద్ద మరణించి 20 ఏళ్ల అయింది. ఆస్తి పంపకాలు చేసుకుందామంటే ఆయన మరణ ధ్రువీకరణ పత్రం కావాలని చెప్పారు. దీనికి కోసం పలుమార్లు రెవెన్యూ కార్యాలయంలో చుట్టూ తిరిగాం. పని కాలేదు. దీంతో మరణ ధ్రువీకరణ పత్రం తరువాత తీసుకోవచ్చని మిన్నకుండిపోయాం. గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకోగా గంటల వ్యవధిలో ఇచ్చారు.

– ఉమాగౌరి, బల్లవోలు, చిల్లకూరు మండలం

ఆధార్ కేంద్రాల్లో సేవలు కరువు

వెంకటగిరి రూరల్: ఆధార్ సవరణ కేంద్రాల్లో సక్రమంగా సేవలు అందకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని 14వ వార్డు కౌన్సిలర్, ఆర్టీఐ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఆరి శంకరయ్య తెలిపారు. శనివారం ఆయన పట్టణంలోని ఆధార్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెంకటగిరి మున్సిపాలిటీ, రూరల్ మండలాలకు కలిపి పట్టణంలో 3 ఆధార్ సవరణ కేంద్రాలు ఏర్పాటు చేయగా గత 6 నెలల నుంచి పని చేయడం లేదన్నారు. ప్రస్తుతం రేషన్‌కార్డుల్లో సవరణలు, మార్పులు, చేర్పులు జరుగుతుండగా ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి అని సచివాలయ అధికారులు చెబుతున్నారని, దీంతో ప్రజలకు ఆధార్ తిప్పలు తప్పడం లేదన్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ఆలయ ధర్మకర్త

వాకాడు : మండలంలోని కల్లూరు కొత్తపాళెం గ్రామంలో నూతనంగా శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి శనివారం వేద పండితులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త దువ్వూరు జనార్ధన్‌రెడ్డి, అనితమ్మ దంపతులు ఆలయ నిర్మాణ భూమి పూజలో పాల్గొన్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో విచ్చేయగా మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

పేదలకు చీరల పంపిణీ

గూడూరు రూరల్ : పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం బాలాజీనగర్‌లోని ప్రగతి కార్యాలయంలో అమరావతి ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ రమణయ్య తల్లి అంతమ్మ 30వ వర్ధంతి సందర్భంగా 50 మంది నిరుపేద మహిళలకు చీరలు, కూరగాయలు, బిర్యానీ పంపిణీ చేశారు. ప్రగతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

దొరవారిసత్రం : రహదారిపై వెళ్తున్న ద్విచక్ర వాహనదారున్ని వేగంగా వస్తున్న ఓ కారు ఢీకొనడంతో అదుపుతప్పి పడిపోవడంతో తండ్రీకూతురు గాయపడిన ఘటన వెదురుపట్టు గ్రామ రోడ్డు సమీపంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు.. శ్రీకాళహస్తికి చెందిన రమేష్ తన కూతురు అవంతికతో కలిసి బైక్‌పై అత్తగారి గ్రామమైన సూరపుఅగ్రహారం గ్రామానికి విచ్చేసి తిరిగి వెళ్తున్న సమయంలో వెదురుపట్టు రోడ్డు వద్దకు రాగానే కారు బైక్‌ను వెనుక నుంచి ఢీకొని పరారైంది. ఈ ప్రమాదంలో తండ్రీకూతురు గాయపడగా స్థానికులు డీవీ సత్రం పీహెచ్‌సీకి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

శాస్త్రోక్తంగా చండీహోమం



హోమం నిర్వహిస్తున్న పండితులు

ఓజిలి: మండలంలోని ఆర్మేనిపాడు గ్రామదేవత ముంగమూరి పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, కుంభాభిషేకాన్ని వేడుకగా నిర్వహించారు. ఆలయ పండితులు అమ్మవారికి దుర్గాసప్తశతి చండీహోమం చేపట్టారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం గ్రామస్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం పొంగళ్లు పెట్టనున్నట్లు కమిటీ సభ్యుడు తాడిపర్తి శోభన్ తెలిపారు.

వాల్‌పోస్టర్ల విడుదల

చిల్లకూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేదవాడు పక్కా గృహం నిర్మించుకునేందుకు ఇంటి స్థలాలు కేటాయించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వారు గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జూన్ 2వ తేదీన ప్రతి మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జూన్ 2న జరిగే ఈ ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, పట్టణ కార్యదర్శి కాలేషా, రైతు సంఘం జిల్లా నాయకులు సీవీఆర్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పొగ రహిత సమాజమే లక్ష్యం

చిట్టమూరు: ఆరోగ్యవంతమైన పొగ రహిత సమాజాన్ని నిర్మిద్దామని చిట్టమూరు పీహెచ్‌సీ వైద్యురాలు పద్మావతి తెలిపారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని చిట్టమూరులో ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థినికి సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

సూళ్లూరుపేట : పట్టణంలోని ప్రతిభ డిగ్రీ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థిని కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న పూర్వ విద్యార్థులు వెంటనే స్పందించారు. శనివారం ఆమెకు వైద్యం కోసం రూ.33 వేలు నగదు సాయాన్ని వారి కుటుంబసభ్యులకు అందజేశారు. 'మేమున్నాం' సంస్థ సభ్యుల సహకారంతో పూర్వ విద్యార్థి మణివాస్ ఆధ్వర్యంలో నగదు అందజేశారు.

పౌరహక్కులపై అవగాహన



మాట్లాడుతున్న తహసీల్దార్

ఓజిలి/దక్కిలి/వాకాడు/కోట: ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అతి గొప్పవరం పౌర హక్కులని, ప్రతి పౌరుడికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రతి అధికారి, సిబ్బందిపై ఉంటుందని అధికారులు తెలిపారు. ఆయా మండలాల్లో గ్రామాల్లో శనివారం సివిల్‌రైట్స్ డే నిర్వహించారు. తహసీల్దార్లు మాట్లాడుతూ పౌర హక్కులపై అందరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

చిల్లకూరు : మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి , అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. చినకటువపల్లికి చెందిన మందపాటి మురళీరెడ్డి, రాధ, జనార్ధనరెడ్డి అనూషా ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు వైద్య పరీక్షలు

వెంకటగిరి(సైదాపురం) : పట్టణంలోని ఆర్టీసీ డిపోలో పని చేసే ఉద్యోగులకు టాటాట్రస్టు క్యాన్సర్ కేర్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ప్రశాంత్ మాట్లాడుతూ ప్రపంచ పొగాకు నిషేధ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సజ్జలకు సన్మానం



సజ్జలను సత్కరిస్తున్న కొండూరు సునీల్‌రెడ్డి

చిల్లకూరు : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి నెల్లూరుకు వచ్చిన సందర్భంగా శనివారం పలువురు నాయకులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల అక్రమ కేసులో అరెస్టు అయిన మాజీమంత్రి కాకాణి గోవర్ధనరెడ్డికి అండగా ఉంటామని తెలియజేసేందుకు ఆయన విచ్చేశారు. ఈసందర్భంగా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సజ్జలను గూడూరుకు చెందిన కొండూరు సునీల్‌రెడ్డి కలిసి తనను రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

ఎన్‌సీసీ విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ ఎన్‌సీసీ విద్యార్థులు శనివారం పొగాకు వాడకం వల్ల కలుగు అనర్థాలను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. వరల్డ్ నో టొబాకో డే సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. కళాశాల డైరెక్టర్ విజయ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ పొగాకు వాడకం వ్యసనంగా మారి ఆరోగ్యాన్ని హరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు మల్లికార్జున రెడ్డి, మాధవయ్య పాల్గొన్నారు.

కోటేశ్వరరావు సేవలు అభినందనీయం



కోటేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న ఎంపీపీ తనుజారెడ్డి

వెంకటగిరి రూరల్ : ఎంపీడీఓగా కేవీ కోటేశ్వరరావు అందించిన సేవలు ఎనలేనివని ఎంపీపీ తంబిరెడ్డి తనుజారెడ్డి కొనియాడారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కోటేశ్వరరావు పదవీ విరమణ వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెంకటగిరి ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన అనతి కాలంలో కోటేశ్వరరావు మండల అభివృద్ధి, పేదలకు ప్రభుత్వ పథకాలు వర్తించేలా సేవలు అందించి మన్ననలు పొందారన్నారు. అనంతరం వెంకటగిరి సీఐ ఏవీరమణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పలు శాఖ అధికారులు కోటేశ్వరరావు దంపతులను పూలమాల, శాలువతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. అంతకముందు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చి కోటేశ్వరరావుకు శాలువ కప్పి అభినందించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో పంటల సాగు



పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

వెంకటగిరి రూరల్ : నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రైతులు పంటలు సాగు చేసుకోవాలని కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు విజయశ్రీ, నాగార్జునరెడ్డి, తిరుపాల్, శ్రీనివాసులరెడ్డి సూచించారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని యాతలూరు, మన్నేగుంట, బంగారుపేట గ్రామాల్లో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, ఐఐఆర్ఐర్ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ చంద్రబాబు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేటటౌన్: వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా చంద్రబాబు పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నాయుడుపేట పట్టణంలోని సంజీవయ క్యాంపు కార్యాలయంలో శనివారం సాయంత్రం నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలప్పుడు చంద్రబాబు మోసపూరిత హామీలు ఇచ్చి, అధికారం చేపట్టాక అమలు చేయకుండా ప్రజలకు సైతం వెన్నుపోటు పొడుస్తున్నారన్నారు.కూటమి ప్రభుత్వ విధానాలను ప్రజలకు తెలిసేలా పార్టీ ఆదేశాల మేరకు నాయుడుపేటలో జూన్ 4న వెన్నుపోటు దినం జరుగుతుందని, అందరూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, పట్టణ అధ్యక్షులు కలికి మాధవ రెడ్డి, మండల కన్వీనర్లు ఒట్టురు కిషోర్ యాదవ్, అనిల్ రెడ్డి, అల్లూరు రాహుల్ రెడ్డి, ఆర్ముగం, ఎంపీపీ ధనలక్ష్మి, నాయకులు మద్దాలి సోమశేఖర్ రెడ్డి, కటకం జయరామయ్య, కట్టా భవాని శంకర్ రెడ్డి, దేశిరెడ్డి మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి వీడ్కోలు

తడ: సుదీర్ఘకాలం పంచాయతీ కార్యదర్శిగా సయ్యద్ బాబు ఎనలేని సేవలు అందించారని తోటి పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. వివాద రహితుడిగా, అందరినీ కలుపుకుపోయే తత్వం కలిగిన బాబు ప్రస్తుతం అండగుండాల కార్యదర్శిగా పనిచేస్తూ రిటైర్డు అయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేఖర్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన స్థల పరిశీలన



శ్మశాన స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయలక్ష్మి

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లి మండలంలోని మన్నూరు గిరిజన కాలనీ శ్మశాన స్థలం ఆక్రమణపై గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేసిన విషయం విదితమే. దీనిపై తహసీల్దార్ విజయలక్ష్మి స్పందించారు. శనివారం రెవెన్యూ సిబ్బందితో కలసి ఆక్రమణకు గురైన గిరిజన శ్మశానభూమిని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సర్వే నంబర్ 68–2 భూమి, రికార్డులను పరిశీలించి హద్దులు కేటాయించామన్నారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలియజేశారు.

బాధ్యతల స్వీకరణ

చిల్లకూరు: గూడూరు సబ్ డివిజన్ కార్యాలయ ఇన్‌చార్జ్‌గా శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీన జూన్ 22 వరకు సెలవుపై వెళ్లారు. దీంతో శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలను అప్పచెప్పుతూ జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

సూళ్లూరుపేట : వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మే 21 నుంచి జూన్ 21 వరకు 11వ అంతర్జాతీయ యోగా డే ఘనంగా జరుపుకుంటున్నామని ప్రిన్సిపల్ డాక్టర్ శర్మ తెలిపారు. శనివారం కళాశాలలో యోగాపై, ర్యాలీ నిర్వహించారు.

కండలేరులో 40.580 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 40.580 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఇన్‌చార్జ్ ఈఈ రామచంద్రమూర్తి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1900, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

భక్తులతో కిక్కిరిసిన పెంచలకోన



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోన శనివారం భక్తులతో కిక్కిరిసింది. బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చే మూడవ శనివారం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 4 గంటల నుంచి అభిషేకం, సుప్రభాతం, పూలంగిసేవ నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కల్యాణ మండపానికి వేంచేపు చేశారు. అనంతరం వివిధ ఆభరణాలు, పుష్పాలతో స్వామి, అమ్మవార్లను అలంకరించి వేదపండితులు మంత్రోచ్ఛరణలు పటిస్తూ కనుల పండువగా కల్యాణం జరిపించారు. రాత్రి 7 గంటలకు ఊంజల్ సేవ, అనంతరం స్వామి, అమ్మవార్లను తిలకించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో ప్రజలకు వెన్నుపోటు



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: కూటమి ప్రభుత్వం తొలి ఏడాది కాలంలోనే ప్రజలకు ఇచ్చిన హామీలో ఒక్కటి కూడా అమలు చేయలేక వెన్నుపోటు పొడిచిందని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం ఆనయ వాకాడులోని తన నివాసంలో వాకాడు, కోట, చిట్టమూరు మండలాల వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చంద్రబాబు చేస్తున్న మోసాలను ఎండగడుతూ జూన్ 4న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాలలో 'వెన్నుపోటు దినం' కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఒక్క రోజు కూడా ప్రజల గురించి ఆలోచించని దుర్మార్గపు పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ వంచనను ప్రశ్నిస్తూ వెన్నుపోటు దినం నిరసనలతో చంద్రబాబు కళ్లు తెరిపిస్తామన్నారు. రాష్ట్రంలో కేవలం రెడ్ బుక్ రాజ్యాంగం మాత్రమే నడుస్తుందని, మైనింగ్ కేసులో అసలు ముద్దాయిలను వదిలేసి ఏ సంబంధం లేని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో నాయకులు దామోదర్‌రెడ్డి, హికుమార్‌రెడ్డి, నాగూర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కస్తూర్‌రెడ్డి, రాజారెడ్డి, మధురెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రవి, వెంకటేశ్వర్లు, శేషురెడ్డి, జనార్ధన్‌రెడ్డి, పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిట్‌ఫండ్ కంపెనీ వేధింపులు తాళలేక..

కోట: ఓ ప్రైవేట్ చిట్‌ఫండ్ కంపెనీ వేధింపుల తాళలేక ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలు.. మండలంలోని రాఘవాపురానికి చెందిన వెంకటయ్య కొడుకు గడ్డం మహేష్ కొన్నేళ్లుగా గూడూరుకు చెందిన చిట్‌ఫండ్ కంపెనీలో పని చేస్తున్నాడు. అయితే మహేష్ ఆ కంపెనీకి కొంత బకాయిలు పడడంతో, అవి చెల్లించాలని సంబంధిత కంపెనీ మేనేజర్ ఒత్తిడి తెచ్చి మానసికంగా వేధించినట్లు తండ్రి వెంకటయ్య తెలిపాడు. దీంతో తన కుమారుడు కేసవరం సమీప పొలాల్లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని, ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో చెన్నైకి తరలించామని వాపోయాడు. వేధింపులకు గురిచేసిన చిట్‌ఫండ్ కంపెనీ మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయడంతో విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయానికి భారీ ఆదాయం

చిల్లకూరు : భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతూ తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయానికి భారీగా ఆదాయం వచ్చినట్లు ఈఓ నవీన్ కుమార్ తెలిపారు. శనివారంమండల తీర ప్రాంతంలోని ముత్యాలమ్మ ఆలయ హుండీ కానుకలను లెక్కించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ రెండు నెలల పాటు అమ్మవారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.28, 96,242 వచ్చిందన్నారు. అలాగే ఆలయంలో అమ్మవారికి సమర్పించే చీరలు, రవికలను సేకరించుకునే లైసెన్స్ హక్కుకు వేలంపాట ద్వారా రూ.10.5 లక్షలు, స్వీట్ స్టాల్ నిర్వహణకు రూ.8.35 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, చిల్లకూరు దశరథరామిరెడ్డి, బ్యాంకు అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పరిశీలన

చిల్లకూరు : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన పాఠ్య పుస్తకాలు మండల కేంద్రానికి చేరుకున్నట్లు ఎంఈఓ–2 ఎండీ రవూఫ్ తెలిపారు. శనివారం చిల్లకూరులోని ఏపీ గురుకుల బాలర పాఠశాలలో పుస్తకాలను దించుకుని అక్కడ నుంచి మండలంలోని పాఠశాలలకు సరఫరా చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది మండలంలోని అన్ని పాఠశాలలకు కలిపి 22,112 పుస్తకాలు వచ్చినట్లు తెలిపారు.